## ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 25-11-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- రాష్ట్రంలో కొత్తగా మూడు జిల్లాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపారు.
- రానున్న ఐదేళ్లలో 15 లక్షల 59 వేల గృహ నిర్మాణాలను పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తోందని మంత్రి కె. పార్ధసారధి తెలియజేశారు.
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "మన్ కీ బాత్.." కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.
- నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం రానున్న 48 గంటల్లో వాయుగుండంగా బలపడుతుందని వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================

రాష్ట్రంలో కొత్తగా మూడు జిల్లాల ఏర్పాటుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపారు. మదనపల్లి, మార్కాపురం, రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాలు కొత్తగా ఏర్పాటు కానున్నాయి. జిల్లాల పునర్ విభజన డివిజన్లు, మండలాల మార్పులు చేర్పులపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం ముఖ్యమంత్రితో అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఈ రోజు సమావేశమయింది. ఈ సందర్భంగా మంత్రులు సమర్పించిన నివేదికను సమీక్షించిన ముఖ్యమంత్రి కొన్ని మార్పులు చేర్పులు చేసి ఆమోదం తెలిపారు. అలాగే 5 కొత్త రెవెన్యూ డివిజన్లను ఏర్పాటు చేసేందుకు అంగీకారం తెలిపారు. అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి రెవెన్యూ డివిజన్, ప్రకాశం జిల్లాలో అద్దంకి, కొత్తగా ఏర్పాటయ్యే మదనపల్లె జిల్లాలో పీలేరు రెవెన్యూ డివిజన్, నంద్యాల జిల్లాలో బనగానపల్లె రెవెన్యూ డివిజన్, శ్రీ సత్యసాయి జిల్లాలో మడకశిర రెవెన్యూ డివిజన్లను కొత్తగా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మూడు కొత్త జిల్లాల ఏర్పాటుతో రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 29కి చేరనుంది.

=====================

రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్లు నిర్మించాలనే లక్ష్యంతో ఎన్డీయే కూటమి ప్రభుత్వం పని చేస్తోందని గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారధి తెలిపారు. రానున్న ఐదేళ్లలో 15 లక్షల 59 గృహ నిర్మాణాలను పూర్తి చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉందని, ఇందులో ఇప్పటికే 3 లక్షల గృహాలను పూర్తి చేయడం జరిగిందని.. మిగిలిన 12 లక్షల 59 వేల లక్షల గృహాలను వచ్చే నాలుగేళ్లలో పూర్తి చేయడం జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర సచివాలయం ప్రచార విభాగంలో మంత్రి పాత్రికేయులతో ఈరోజు మాట్లాడుతూ... ఇప్పటికే పూర్తి చేసిన 3 లక్షల గృహాలతో పాటు వచ్చే ఉగాది నాటికి 5 లక్షల గృహాలను, జూన్ నాటికి మరో 87 వేల గృహాలను పూర్తి చేయాలనే లక్ష్యంతో తమ ప్రభుత్వం ముందుకు వెళుతోందని చెప్పారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం అమలు గడువును కేంద్ర ప్రభుత్వం మరో ఏడాది పాటు పొడిగించిన నేపథ్యంలో అర్హులందరూ దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఇళ్లు లేని నిరుపేదలందరికీ 2029 నాటికి శాశ్వత గృహ వసతి కల్పిస్తామని మంత్రి పార్ధసారధి వివరిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

=====================

కేంద్ర ప్రభుత్వం ఇటీవల సరళీకృతం చేసిన నూతన కార్మిక చట్టాలను ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు స్వాగతించారు. విజయవాడలో ఈరోజు నిర్వహించిన ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏపీ చాంబర్స్ బిజినెస్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో పాల్గొన్న ఆ సంస్థ అధ్యక్షుడు పొట్లూరి భాస్కర్ రావు మాట్లాడుతూ... గతంలో ఉన్న 29 చట్టాలను మార్పు చేసి నాలుగు కార్మిక చట్టాలుగా అమలు చేయడంపై ఆయన హర్షం వ్యక్తం చేసారు.

=====================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు లేదా నరేంద్ర మోదీ యాప్‌కు ఈనెల 28వ తేదీ సాయంత్రం వరకు పంపవచ్చు.

విరామం

=====================

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల 6వ జాతీయ సాంస్కృతిక ఉత్సవాలు విజయవాడ వేదికగా జరగనున్నాయి. ఉద్భవ్-2025 పేరిట విజయవాడ కె.ఎల్. యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలకు సర్వం సిద్ధం చేశామని మహిళా శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల ఆధ్వర్యంలో డిసెంబర్ 3వ తేదీ నుండి 3 రోజుల పాటు ఈ ఉత్సవాలను పండగ వాతావరణంలో నిర్వహించనున్నామని చెప్పారు. రాష్ట్ర సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో ఈరోజు ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఈ వివరాలను మంత్రి వెల్లడించారు. గిరిజన విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీయడం వారిలో జాతీయ సమైఖ్యతను ప్రోత్సహించడమే ఈ ఉద్భవ్-2025 ముఖ్య ఉద్దేశ్యమని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

=====================

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ప్రతి ఏటా సంక్రాంతి సందర్భంగా నిర్వహించే “జగ్గన్నతోట ప్రభల తీర్థాన్ని” రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆమోదం తెలిపారని పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ తెలియజేశారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పి. గన్నవరం నియోజకవర్గం అంబాజీపేట మండలం మొసలపల్లి గ్రామంలో ప్రతి ఏటా జగ్గన్నతోట ప్రభల తీర్థం పండుగను నిర్వహిస్తుంటారు. రాజోలు పర్యటనలో ఉన్న మంత్రి కందుల దుర్గేష్ ఈరోజు విలేకరులతో మాట్లాడుతూ... గతంలో తన దృష్టికి తీసుకువచ్చిన ఈ అంశాన్ని ముఖ్యమంత్రితో చర్చించడం జరిగిందని చెప్పారు. దీనికి ఆయన కూడా సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ఎప్పటినుంచో కోనసీమ వాసులు కోరుకుంటున్న జగ్గన్నతోట ప్రభల తీర్థానికి రాష్ట్ర పండుగ హోదా త్వరలో లభిస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

=====================

గుహవాటి వేదికగా జరుగుతున్న రెండవ టెస్ట్ మ్యాచ్ లో భారత్ కు దక్షిణాఫ్రికా 549 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. 26 పరుగుల ఓవర్ నైట్ స్కోర్ తో నాల్గవ రోజు రెండవ ఇన్నింగ్స్ కొనసాగించిన దక్షిణాఫ్రికా 260 పరుగుల వద్ద డిక్లేర్డ్ చేసింది. దీంతో తొలి ఇన్నింగ్స్ లోని 288 పరుగుల ఆధిక్యం కలిపి మొత్తం 549 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. లక్ష్య చేదనలో భారత్ ఈరోజు ఆట ముగిసే సమయానికి రెండు వికెట్లు నష్టపోయి 27 పరుగులు చేసింది. దక్షిణాఫ్రికా బ్యాట్స్ మెన్ ట్రిస్టన్ స్టబ్స్ రెండవ ఇన్నింగ్స్ లో అత్యధికంగా 96 పరుగులు చేయగా భారత్ బౌలర్ రవీంద్ర జడేజా 4 వికెట్లు తీశాడు. ఆఖరి రోజైన రేపు భారత్ విజయం సాధించడానికి ఇంకా 522 పరుగులు చేయాల్సి ఉండగా దక్షిణాఫ్రికా విజయానికి 8 వికెట్లు తీయాల్సి ఉంది.

=====================

మలక్కా జలసంధి వద్ద గుర్తించబడిన నిన్నటి అల్పపీడనం పశ్చిమ-వాయువ్య దిశగా కదిలి ఈరోజు ఉదయం వాయుగుండంగా మారిందని.. ఇది నెమ్మదిగా అదే దిశలో ప్రయాణిస్తూ రాబోయే 48 గంటల్లో మరింత బలపడే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. నైరుతి బంగాళాఖాతంలో ఉపరితల ఆవరణం ప్రభావంతో మరొక అల్పపీడనం ఏర్పడిందని వాతావరణ కేంద్ర అధికారి ఎల్. నారాయణ వెల్లడిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

వీటి ప్రభావంతో ఉత్తర కోస్తా ఆంధ్రలో రేపు పొడి వాతావరణం ఏర్పడే అవకాశముందని తెలిపారు. ఇక దక్షిణ కోస్తా ఆంధ్ర, రాయలసీమలలో తేలికపాటి నుండి మోస్తరు వర్షాలు లేదా జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించారు.

=====================

=====================